ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5 **మహబూబ్‌నగర్** జిల్లా వార్తలు

శుక్రవారం 27 జూన్ 2025

నేర పరిశోధనలో అవగాహన ఉండాలి

- శిక్షణ అధికారి రాజేంద్రప్రసాద్
- కోయిల్‌కొండ పీఎస్‌లో నేర పరిశోధన ల్యాబ్ ప్రారంభం

7

పురుడు పోసుకున్న అరుదైన పాము

అబ్బురం

జడ్చర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జీవ వైవిధ్య పరిశోధన, విద్యా కేంద్రంలో అరుదైన పాము పురుడు పోసుకుందని వృక్షశాస్త్ర సహాయ చార్యులు డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటలో ఏప్రిల్ 30న ఓ ఇంట్లోకి పాము వచ్చింది. దానిని చంపకుండా స్థానికుడైన లోకేశ్ పట్టుకుని జీవ వైవిధ్య పరిశోధన కేంద్రంలో అప్పగించాడు. అప్పుడే ఆ పాము 9 గుడ్లు పెట్టింది. ఆ పామును రాబ్డోఫీస్ ప్లంబికలర్ అనే విషరహిత పాముగా గుర్తించారు. కోలుబ్రిడే అనే కుటుంబానికి చెందినది. అది పెట్టిన గుడ్లను బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిల్వ చేశారు. ఆ గుడ్లలో నుంచి గురువారం నాలుగు పాము పిల్లలు బయటికి వచ్చాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోనే పాములు గుడ్లు పొదుగుతాయని, కానీ జూన్‌లో పొదగడం వాతావరణంలో వచ్చే మార్పులకు నిదర్శనమని సదాశివయ్య తెలిపారు. ఈ పాములు మెడపై బాణం ఆకారంలో పసుపురంగు గుర్తును కలిగి ఉంటాయని, కంటి నుంచి నోటి వరకు నలుపు చార ఉంటుందని వివరించారు. ఇవి ఎత్తయిన అటవీ ప్రాంతంలో అధికంగా ఉంటాయని, కేవలం భారత ఉపఖండంలో మాత్రమే జీవిస్తాయని, దక్షిణ భారతదేశంలో అధికంగా ఉంటాయని చెప్పారు. పాము పిల్లలను అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని తెలిపారు.




విష రహిత రాబ్డోఫీస్ ప్లంబికలర్ పాము పిల్లలు

క్లిక్.. క్లిక్.. జూరాలకు పసిడి సొబగులు

అద్భుతం

జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు గురువారం పసిడి వర్ణంలోకి మారింది. సాయంత్రం వేళ సూర్యుని కిరణాలు పడి, ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తళతళా మెరిసిపోయింది. ప్రాజెక్టును చూడటానికి వచ్చిన సందర్శకులు ఈ సుందర దృశ్యాన్ని చూసి సంబురపడ్డారు.

\- ఆంధ్రజ్యోతి, గద్వాల



దిద్దుబాటుపై.. దృష్టి

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో లోపాలపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ముగ్గురు ఐఏఎస్‌లు, ఇద్దరు ఉన్నతాధికారులతో కమిటీ
- నేడు మహబూబ్‌నగర్, రేపు నారాయణపేట కళాశాలల్లో తనిఖీలు
- 30 వరకు నివేదిక సమర్పించాలని గవర్నమెంట్ ఆదేశాలు



మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలపై జాతీయ వైద్య మండలి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు లోపాలున్నాయని షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొత్త, పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో లోపాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలోని కళాశాలల్లో లోపాలను అధ్యయనం చేసేందుకు ముగ్గురు ఐఏఎస్‌లు, మరో ఇద్దరు ఉన్నతాధికారులు కలిపి మొత్తం 5 మందితో ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ సభ్యులు శుక్రవారం మహబూబ్‌నగర్, శనివారం నారాయణపేట మెడికల్ కళాశాలలను తనిఖీ చేయనున్నారు. అధ్యయనం చేసిన తర్వాత ఈనెల 30 వరకు నివేదికను సమర్పిం చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

లోపాలపై అధ్యయనం..

జాతీయ వైద్య మండలి ముఖ్యంగా 5 లోపాలను గుర్తించింది. ఇందులో వసతులు, ఫ్యాకల్టీ, పడకలు, ఆపరేషన్ థియేటర్ల లేమిని గుర్తించింది. మహబూబ్ నగర్ మెడికల్ కళాశాల నుంచి ఈ ఏడాది పదో బ్యాచు 200 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి కోసం దరఖాస్తు చేశారు. 200 సీట్లకుగాను ఫ్యాకల్టీ(ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు) 232 మంది ఉండాలి. కానీ 129 మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లు మొత్తం 115 మంది ఉండాలి. కానీ కేవలం 80 మంది మాత్రమే ఉన్నారు. దీంతోపాటు 770 పడకలకు గాను 710 మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఖాళీగా ఉన్నాయి. మేజర్ ఆపరేషన్ థియేటర్లు 10కి గాను 8, మైనర్ ఆపరేషన్ థియేటర్లు 5కు గాను 3 ఉన్నాయి. కెడావర్(శవాలు) 18 ఉండాల్సి ఉండగా, 12 మాత్రమే ఉన్నాయి. హిస్టోపాథాలజీ పరీక్షలు కూడా తక్కువగా చేశారు. అదే విధంగా నారాయణపేట మెడికల్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 50 సీట్లకు 95 మంది ఫ్యాకల్టీ ఉండాలి. కానీ 38 మంది మాత్రమే పని చేస్తున్నారు. 57 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా 200 పడకలకు గాను 100 పడకలే ఉన్నాయి. మేజర్, మైనర్ ఆపరేషన్ థియేటర్లు 10కి గాను 4 మాత్రమే ఉన్నాయి. కెడావర్లు(శవాలు) 5కు గాను 2 మాత్రమే ఉన్నాయి.



నారాయణపేట మెడికల్ కళాశాల

ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో లోపాలు చాలా ఉన్నాయని జాతీయ వైద్య మండలి తీవ్ర అంసతృప్తిని వ్యక్తం చేసింది. ఆయా లోపాలపై షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆ కళాశాలల్లో లోపాలను సరిచేసి, ఎంసీఐకి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఈనెల 16న అన్ని జిల్లాల కళాశాల ప్రిన్సిపాల్స్, అధికారులతో హైదరాబాద్ లోని డీఎంఈ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసింది. ఆ లోపాలను సరిదిద్దుకునేందుకు పూర్తి అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



అధ్యయనం చేసేందుకు ఐఏఎస్‌లతో కమిటీ..

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని మెడికల్ కళాశాలల్లో ఉన్న లోపాలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఐఏఎస్ అధికారులు టీజీసాక్స్ పీడీ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు విజయేందిర బోయి, సిక్తా పట్నాయక్, టీజీఎంఎస్ఐడీసీ సీఈ రవీందర్, మహబూబ్‌నగర్ వైద్యకళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ ఉన్నారు.

నేడు, రేపు కళాశాలల్లో అధ్యయనం..

ఆయా కళాశాలల్లో ఎంసీఐ గుర్తించిన లోపాలతో పాటు మరిన్ని సమస్యలను అధ్యయనం చేసేందుకు శుక్ర, శని వారాల్లో తనిఖీలు చేపట్టనున్నారు. శుక్రవారం మహబూబ్ నగర్ వైద్యకళాశాల, ఆసుపత్రి, శనివారం నారాయణపేట వైద్య కళాశాల, ఆసుపత్రిలలో కమిటీ తనిఖీలు చేయనుంది. ఈ కమిటీ కళాశాల, ఆసుపత్రిలో మంజూరైన పోస్టులు, పని చేస్తున్న ఫ్యాకల్టీ, ఖాళీలు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు?, ఇంకా ఎంతమందిని ఏయే నోటిఫికేషన్ల ద్వారా రిక్రూట్ చేయాలనే అంశాలను కూడా అధ్యయనం చేయనున్నారు. అంతేకాకుండా మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, నిర్మాణాలు, బడ్జెట్ వ్యవహారాలు, పడకలు, సీట్ల కేటాయింపులు, డాక్టర్లు, సిబ్బంది హాజరు, ఆరోగ్యశ్రీ కేసులు, ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, వినియోగం, వంటి ప్రతీ అంశంపైనా అధ్యయనం చేయనున్నారు. ఆ నివేదికను ఈనెల 30న సమర్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సీబీఎస్ఈ పేరుతో గాలం

- అనుమతి లేకున్నా అధిక ఫీజు వసూలు
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలు
- ప్రశ్నార్థకంగా మారనున్న స్టూడెంట్స్ భవిష్యత్

6

మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతీ పౌరుడి బాధ్యత

- జిల్లా న్యాయమూర్తి బి పాపిరెడ్డి
- పాలమూరులో అవగాహన ర్యాలీ



జెండా ఊపి, ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయని, వాటి నియంత్రణ ప్రతీ పౌరుడి బాధ్యత అని జిల్లా న్యాయమూర్తి బి పాపిరెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్టేడియం మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ చేశారు. పాపిరెడ్డి కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకిలతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా వాటిని అరికట్టాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని సూచించారు. కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి డ్రగ్స్ ఫ్రీ సొసైటీగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా జరుగుతున్న సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదంటే 1908 నెంబర్‌లకు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సందర్భంగా డ్రగ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఇందిర, డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ నటరాజ్ పాల్గొన్నారు.

పంటలకు సకాలంలో సాగునీరు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- సరళాసాగర్ ఎత్తిపోతల పథకం మోటార్ల ప్రారంభం
- జూరాలకు వరద రావడంతో లిఫ్టు ద్వారా ప్రాజెక్టులోకి నీటి విడుదల
- పంటలకు త్వరలోనే నీరిస్తామని వెల్లడి

6

మహిళా సంక్షేమాన్ని విస్మరిస్తున్న బీజేపీ

- సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత



ఖాళీ సిలిండర్‌లతో ధర్నా చేస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, కార్యకర్తలు

మహబూబ్‌నగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ మహిళా సంక్షేమాన్ని విస్మరిస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. మహిళల సంక్షేమాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గురువారం మహబూబ్‌నగర్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తాకు చేరుకుని ఖాళీ సిలిండర్‌లతో నిరసన చేపట్టారు. సామాన్యుడి నడ్డి విరిచేలా సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమన్నారు. చివరకు పిల్లలు ఉపయోగించే పెన్సిల్, పాలపై కూడా జీఎస్టీ విధించడం దారుణన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని, ధరలను నియంత్రించడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విభాగాలలో కమిటీలను నియమించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు సుకన్య, వెంకటసుబ్బమ్మ, అరుణ, నగర, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

భోజన నాణ్యతలో రాజీ పడొద్దు

- పాలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్
- పీయూలోని బాలుర హాస్టల్ పరిశీలన
- విద్యార్థులతో కలిసి భోజనం
- సమస్యలుంటే మా దృష్టికి తేవాలని వెల్లడి

7

క్రీడలతో బంగారు భవిష్యత్తు

- డీవైఎస్‌వో ఎస్. శ్రీనివాస్
- ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు



ఎంపికల్లో భాగంగా జంప్ చేస్తున్న చిన్నారి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి జిల్లా స్టేడియం మైదానంలో ఈ ఏడాది స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలను డీవైఎస్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికలకు 28 మదిఇ బాలురు, 9 మంది బాలికలకు కలిపి 37 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 60 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాండ్ జంప్, ఫ్లెక్సిబిలిటి టెస్ట్, మెడిసిన్ బాల్‌త్రో తదితర అంశాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హకీంపేటలో జూలై 4, 5 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపిస్తామని తెలిపారు. ఫలితలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు సైదులు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, కోచ్‌లు సునీల్‌కుమార్, ఖలీల్, పర్వేజ్, అంజద్, నికేశ్, మల్లేష్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ కాలుష్యం నుంచి కాపాడాలి

» కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు రామిరెడ్డి

ఎర్రవల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం లోని కొండేరు గ్రామ శివారులో ఉన్న ఎస్ఎన్ఎస్ ఫ్యాక్టరీ కాలుష్యం నుంచి తమను కాపాడాలని రైతు రామిరెడ్డి గురువారం కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. 13ఏళ్ల నుంచి తన భూమిని లీజుకు తీసుకుని ఏడాది వదిలేశారని, ఇప్పుడు పంట సాగు చేయాలంటే వ్యర్థజలం వదిలి బూడిద పడి పంటకు అనువుగా లేదని తెలిపారు. దీంతో కంపెనీ యాజమాన్యం న్యాయం చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. వ్యర్థజలం, బూడిద, దుర్వాసనతో చుట్టూ పొలాలు, గ్రామాలకు తీరని సమస్యగా మారిందని విన్నవించారు.

36 గంటల పాటు నీటి సరఫరా నిలిపివేత

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 36 గంటలపాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మహబూబ్‌నగర్ మిషన్ భగీరథ డివిజన్ ఇంజనీరు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నుంచి నారాయణపేటకు వెళ్లే మార్గంలో మరికల్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల మరమ్మతు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 245 గ్రామాలు, మూడు మునిసిపాలిటీల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రైతులకు సకాలంలో సాగునీరు

» దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



సరళాసాగర్ లిఫ్టు మోటార్లకు పూజలు చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ఎత్తిపోతల పథకం మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూరాలకు వరద రావడంతో సరళాసాగర్ లిఫ్టు ద్వారా ప్రాజెక్టును నింపుతామని తెలిపారు. త్వరలోనే సరళాసాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తామని అన్నారు. ఇప్పటికే రైతులందరికీ రైతుభరోసా అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, మహేష్‌కుమార్, వెంకట్‌నారాయణ, కృష్ణవర్ధన్‌రెడ్డి, జగదీష్, వడ్డె కృష్ణ పాల్గొన్నారు.

హంస వాహనంపై గోవిందుడు



భక్తిగీతాలాపన చేస్తున్న శోభాయుగేంధర్‌రావు



హంస వాహనంపై గోవిందుడు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాటన్‌మిల్ సమీపంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు గురువారం ప్రాతఃకాల పూజలు, మూలమంత్ర జపం, చంద్రమౌళీశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శోభాయుగంధర్‌రావుచే సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భజన మండలి సభ్యులచే భక్తిగీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం స్వామి వారిని హంసవాహనంపై ప్రత్యేకంగా అలంకరణ చేసి ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో భజనమండలి సభ్యులు, భక్తులు పాల్గొని గోవిందనామస్మరణ చేశారు.

'విజయ'ను వీడి.. ప్రైవేట్ వైపు పయనం



వెల్దండలో పాడి ఆవులతో షెడ్

» పాల ధర తగ్గింపు ఎఫెక్ట్

» రైతుకు భారమవుతున్న పాడిఆవుల పోషణ

» బిల్లులు రాక... ప్రోత్సాహం లేక ఇక్కట్లు

» పాల ధర తగ్గించిన విజయ డెయిరీ

వెల్దండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీలో పాలుపోసే రైతులకు పాల ధరలు పెంచడం మాట అటుంచితే ఉన్న ధరలను తగ్గించింది. ఉన్నఫలంగా గత ఏప్రిల్ నుంచి ఆవుపాలకు ఏకంగా లీటరుకు రూ. 3 నుంచి 4 రూపాయలు తగ్గించడంతో పాడిపరిశ్రమనే నమ్ముకున్న రైతాంగం ఆందోళన చెందుతోంది. గోటిపై రోకటిపోటు అన్న చందంగా దాణా ధరలు పెరగడం, నిర్వహణ భారంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా సకాలంలో బిల్లులు రాక, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన లీటరుకు రూ. 4 ప్రోత్సాహకం జాడేలేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విధిలేక విజయ డెయిరీ నుంచి ప్రైవేటు పాలసేకరణ కేంద్రాల వైపు చూస్తున్నారు.

రాష్ట్రంలో రెండో స్థానంలో విజయ డెయిరీ

రాష్ట్రంలో పాలసేకరణలో నాగర్‌కర్నూల్ జిల్లాలో విజయ డెయిరీ రెండో స్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో అధికంగా రైతులు పాడిపరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్నారు. రైతులతో పాటుగా నిరుద్యోగ యువత పాడిపరిశ్రమ రంగంలోకి వచ్చారు. ఈ క్రమంలో హెచ్ఎఫ్, జెర్సీ, ఏబీఎస్ వంటి సంకరజాతి ఆవులను మహారాష్ట్రలోని లోని, దేవుని, కర్ణాటకలోని చింతామణి, ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరు వంటి ప్రాంతాల నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 7 వేలమంది రైతులు గ్రామాల్లో ఏర్పాటుచేసిన 225 విజయ డెయిరీ పాలసేకరణ కేంద్రాల్లో పాలుపోస్తున్నారు. దీనికిగాను జిల్లాలో కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రంతో పాటు వెల్దండ, కొండారెడ్డిపల్లి, ఊర్కొండ, కుప్పగండ్ల, మాదారం, గుండూరు, అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో బీఎంసీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రతిరోజు ప్రస్తుతం సుమారు 96వేల లీటర్ల పాలు పోస్తున్నారు. అంతేగాక గ్రామాల్లో ప్రైవేటు డెయిరీలు అయిన మస్కతి, తిరుమల, హడ్సన్ వంటి పాలసేకరణ కేంద్రాలు వెలిశాయి.

బిల్లులు రాక ... ధరలేక ..

విజయ డెయిరీ రైతులు గత కొన్ని నెలలుగా సకాలంలో బిల్లులు రాకపోవడం, ఇటీవల ఆవుపాల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం, గతంలో ఇచ్చిన పాడికి ప్రోత్సాహకం జాడే లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ పదిహేను రోజులకు ఒకసారి వచ్చే బిల్లులు రెండు, మూడు పెండింగ్‌లో ఉంటున్నాయి. గత ప్రభుత్వం 2016లో విజయ డెయిరీ ద్వారా రైతులను ప్రోత్సహిస్తూ లీటరుకు రూ. 4 చెల్లించింది. కాగా గత 2020 నుంచి ప్రోత్సాహకం బిల్లులు ఆగిపోయాయి. సంబంధిత అధికారుల అంచనా ప్రకారం సుమారు 35 కోట్లకు పైగా ప్రోత్సాహకం బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు, ప్రోత్సాహకం మాటటుంచితే.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఉన్నఫలంగా ఆవుపాల ధరలు అమాంతంగా లీటరుకు రూ. 3 నుంచి 4 వరకు తగ్గించింది. మద్దతు ధర కల్పించి ప్రోత్సహించాలి గానీ ధరలు తగ్గించడమేమిటని పాడిరైతులు ప్రశ్నిస్తున్నారు. పాలకుల నిర్ణయంతో గతేడాది ఇదే సీజన్‌లో సుమారు లక్షా 2వేల లీటర్ల పాలసేకరణ ప్రస్తుతం 96వేలకు పడిపోయింది. విజయ పాడిరైతులు ఒక్కొక్కరుగా కేంద్రాలను వీడి గ్రామాల్లోని మస్కతి, తిరుమల, హడ్సన్, దొడ్ల వంటి ప్రైవేట్ డెయిరీల వైపు వెళుతున్నారు. విజయ డెయిరీకి ప్రైవేటుకు పెద్దగా ఏమీ తేడా లేనప్పటికీ ప్రైవేటులో ప్రతీ పదిరోజులకోసారి సకాలంలో బిల్లులు ఇస్తున్నారని రైతులు తెలిపారు. పాలక ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీ రైతులను ఆదుకోవాలని, సకాలంలో బిల్లులు చెల్లించి, లీటరుకు తగ్గించిన ధరలను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకం బకాయిలను చెల్లించాలని పాడి రైతులు కోరుతున్నారు.

భారమవుతున్న పాడిపశువుల పోషణ



ఆవుపాల ధరను తగ్గించడంతో పాడి పశువుల పోషణ భారమవుతున్నది. ప్రతి రోజు సుమారు కేంద్రంలో 40 లీటర్లవరకు పాలుపోస్తాను. గత రెండు నెలలుగా పాల ధరను తగ్గించడంతో నెలకు సుమారు 5వేల వరకు ఆదాయం తగ్గింది. దీంతో ఆవుల దాణాకు, మందులకు సైతం ఇబ్బందులు పడుతున్నాను. తగ్గించిన పాలధరను ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించాలి.

\- మిరియాల సత్యనారాయణ, రైతు, వెల్దండ

మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ...



పాడి రైతులు తగ్గిన ధరలతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆవుపాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకే పాలు సరఫరా అవుతున్నాయి. ఈ క్రమంలో రైతులను ఆదుకునేందుకు మార్కెట్‌లో డిమాండ్ నేపథ్యంలో గేదె పాలకు విజయ డెయిరీ ద్వారా రూ. 5 అదనంగా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న డిమాండ్ నేపథ్యంలో గేదెల పెంపకం పట్ల ఆసక్తి కనబరిస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు.

\- సత్యనారాయణ యాదవ్, విజయ డెయిరీ, నాగర్‌కర్నూల్ డిప్యూటీ డైరెక్టర్

హిందూ ధర్మాన్ని ఎవరూ ఆపలేరు

» గోసంరక్షణకు శివాజీ స్ఫూర్తి కావాలి

» గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



పేరపళ్లలో శివాజీ విగ్రహం ఆవిష్కరణలో మాట్లాడుతున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

నారాయణపేట రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని ఎవరూ ఆపలేరని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గురువారం నారాయణపేట మండలంలోని పేరపళ్ల గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆనాడే మొగలులు, బ్రిటీషులు ఎన్ని ప్రయత్నాలుచేసినా హిందూ సమాజం చెక్కు చెదర లేదన్నారు. హిందూ ధర్మ రక్షణకు శివాజీ చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సనాతన ధర్మ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు గోరక్షణ చేయాలన్నారు. శివాజీ తన 12వ ఏటనే గోవులను రక్షించాడన్నారు. నేడు ఒక వర్గం ఓట్లకోసం హైదరాబాద్ నగరం నుంచి రోజు గోవులను అక్రమంగా తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకుని ధర్మరక్షణ కోసం కృషిచేయాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి, వీరసావర్కర్, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.సత్యయాదవ్, నందునామాజీ, రాజ్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పటిష్టతకు ప్రభుత్వం కృషి

» అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

» రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల ప్రమాణ స్వీకారం



దేవస్థానం ధర్మకర్తలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవానికి గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదని, అందులో భాగంగా ఆలయాలను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. అదే విధంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం చైర్మన్‌గా బతుక మల్లయ్య, వైస్ చైర్మన్‌గా శ్రీశైలం గౌడ్, ధర్మకర్తలుగా పద్మ, మహేష్, మల్లయ్య, పూజారి విజయ్‌కుమార్ ప్రమాణం స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత, గిరివర్ధన్‌గౌడ్, రఫీ, రాంప్రసాద్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, నిరంజన్, ఖాజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం



అలంకరణలో శివుడు

దేవరకద్ర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని శివాలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు నాగరాజు, నాగభూషన్, చైర్మన్ నరసింహరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు నల్లమల అనుకూలం

» పర్యాటకులకు పులులు కనిపించడంతో ఆనందం

» అమ్రాబాద్ ఎఫ్‌డీవో రాంమూర్తి

అమ్రాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవి ప్రాంతంలో వన్యప్రాణులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడడంతో వాటి సంఖ్య అభివృద్ధి చెందిందని అమ్రాబాద్ ఎఫ్‌డీవో రాంమూర్తి తెలిపారు. గురువారం అమ్రాబాద్ రేంజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సఫారీ పర్యాటకులకు పెద్దపులి, చిరుత, ఇతర వన్యప్రాణులు కనిపించడంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. మహారాష్ట్రలోని తడోబా పెద్దపులుల అభయారణ్యంలో సఫారీకి వెళ్లిన 50 శాతం మంది పర్యాటకులకు పెద్ద పులులతో పాటు ఇతర వన్యప్రాణులు కనిపించడంతో అక్కడ పర్యాటకుల సంఖ్య పెరిగిందని తెలిపారు. అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో కూడా పర్యాటకుల సంఖ్యను పెంచడం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. జంతువుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవిలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడినట్లు పేర్కొన్నారు. అమ్రాబాద్ అటవీ రేంజ్ అధికారి వీరేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు అపహరణ

మక్తల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏటీఎం సెంటర్‌లో ఏటీఎం కార్డులు మార్పిడీ చేసి రూ.40వేలు చోరీ చేసిన ఘటన గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మాగనూరు మండలం నేరడ్‌గం గ్రామానికి చెందిన వెంకటేష్, మరో వ్యక్తి కలిసి ఏటీఎం కార్డు ద్వారా డబ్బులు డ్రా చేసుకునేందుకు పట్టణంలోని సంగంబండ రోడ్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్దకు వెళ్లారు. వారికి ఏటీఎం కార్డు ఆపరేటింగ్ తెలియకపోవడంతో వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న ఓ వ్యక్తి తన వద్ద ఉన్న కార్డులు తీసుకొని డబ్బులు డ్రా చేసి ఇస్తామని నమ్మబలికి కార్డులు మార్పిడీ చేసి చాకచక్యంగా అక్కడి నుంచి ఉడాయించాడు. ఆ తర్వాత ఒక్కో కార్డు ద్వారా రూ.20వేల చొప్పున మొత్తం రూ.40వేలు డ్రా చేసుకున్నాడు. అనంతరం తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. అపరిచిత వ్యక్తులకు ఏటీఎం కార్డులు, పిన్ నెంబర్ తెలియజేయకూడదన్నారు.

భూమిని అక్రమంగా దున్నినవారిపై కేసు

గండీడ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో కేసు నమోదైన ఘటన మండలంలోని సల్కర్‌పేట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన జీ చంద్రయ్య కొన్నేళ్ల నుంచి కాస్తులో ఉన్న భూమి విషయంలో కొన్ని రోజులుగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్, కృష్ణయ్య, గోవర్ధన్ గొడవలు జరుగుతున్న విషయంలో వారు కోర్టుకి సంప్రదించి సివిల్ కేసు వేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 24న ట్రాక్టర్‌తో భూములకు ప్రవేశించి పొలం దున్నిన విషయంలో చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురి బైండోవర్

మానవపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురికి బైండవర్ చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో ఉన్న శివాలయం వద్ద నారాయణపేట జిల్లా మరికల్ మండలం జక్లేరు గ్రామానికి చెందిన మహేష్, వినోద్, షైబు, బాలకృష్ణ, కొండన్నపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం విచారించి తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఎదుట బైండవర్ చేసినట్లు తెలిపారు. మరోమారు అనుమానంగా రాత్రివేళల్లో తిరిగితే ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దార్ పేర్కొన్నట్లు వివరించారు.

మైనార్టీ కళాశాల తనిఖీ

నారాయణపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల(బాలుర)ను గురువారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎం.ఏ.రషీద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యకు సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కాలేజీ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు. అకాడమిక్ కోఆర్డినేటర్ టీఎంఆర్ఈఐఎస్ మహ్మద్ సలీం ఉన్నారు. అనంతరం డీఎండబ్ల్యూవో కాలేజీలోని డైనింగ్ హాల్, డార్మిటరీ, వంట గదిని పరిశీలించి హెడ్ కుక్, హెల్పర్స్‌కు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

సీబీఎస్ఈ పేరుతో గాలం

» అనుమతి లేకున్నా అధిక ఫీజులు

» విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు

» ప్రశ్నార్థకంగా మారనున్న విద్యార్థుల భవిష్యత్



జడ్చర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సీబీ ఎస్ఈ పేరిట విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. అనుమతులు తీసుకోకుండానే తరగతులను నిర్వహిస్తున్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్‌లు కట్టి మరీ ప్రచారం నిర్వహిస్తున్నా, విద్యాశాఖ అధికారుల దృష్టి ఆయా విద్యాసంస్థలపై పడకపోవడం గమనార్హం.

పలు పేర్లతో నిర్వహణ..

ప్రస్తుత విద్యాసంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లాలో 150కి పైగా దరఖాస్తులు వచ్చాయని ఇటీవల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఇచ్చారు. జడ్చర్ల పట్టణంలో ప్లే స్కూల్స్ పేరుతో పాటు పలు పాఠశాలలు పలు పేర్లతో ప్రారంభిస్తున్నారు. కల్వకుర్తికి వెళ్లే దారిలో 7వ తరగతి వరకు ఓ పాఠశాలను నెలకొల్పారు. అలాగే హౌసింగ్‌బోర్డులో 5వ తరగతి వరకు, అల్మాస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో, తాలుకా క్లబ్ ఏరియాలో అనుమతులు లేకుండానే ప్లేస్కూల్స్‌ను నెలకొల్పారు. అనుమతులు కలిగిన భవనంలో పాఠశాల నిర్వహించకుండా, మరో భవనంలోకి ఇటీవల ఓ పాఠశాలను మార్చారు. నేతాజీచౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న సదరు పాఠశాల స్టేట్ సిలబస్‌తో నిర్వహించగా, కొత్త భవనంలోకి మార్చుతూనే సీబీఎస్ఈ సిలబస్‌తో విద్యాబోధన చేస్తున్నామంటూ విస్తృత ప్రచారం చేపట్టింది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుమతులు ఇచ్చే ప్రక్రియలో హైస్కూల్ స్థాయిలో 8వ తరగతికి మొదటగా అనుమతి ఇచ్చి, అనంతరం వరుస విద్యాసంవత్సరాలలో 9, 10వ తరగతికి అనుమతులు ఇస్తుంది. కానీ సదరు పాఠశాల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండానే పదో తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో తరగతులను నిర్వహిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ విద్యార్థు లకు వార్షిక పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తారో యాజమాన్యానికే తెలియాలి. ఆడుకోవడానికి స్థలాలు ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం పొందుపరిచింది. కొన్ని పాఠశాలలకు కనీసం ప్రార్థన స్థలం లేకున్నా, అనుమతులు ఎలా ఇచ్చారో విద్యాశాఖ అధికారులకే తెలియాలి.

ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా..

ప్రతీ విద్యార్థి పూర్తి సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యు డైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్), అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లతో పాటు పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్)లలో నమోదు చేసేలా కార్యక్రమాలు చేపడుతున్నాయి. అనుమతులు లేని పాఠశాలలో చదువుకునే విద్యార్థుల వివరాలు నమోదు కాకపోవడంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. వీరికి టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్), బోనఫైడ్‌లు జారీ చేయడానికి వీలుండదు. ప్రస్తుతం ఎస్ఎస్‌సీ విద్యార్థులకు మెమోలలో పెన్ నెంబరును నమోదు చేసి అందచేస్తున్నారు.

అనుమతులు తీసుకున్నాకే తరగతులు



పాఠశాల నిర్వహణకు సంబంధించి అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే తరగతులను నిర్వహించాలని పాఠశాలలు నెలకొల్పే వారికి సూచిస్తున్నాం. అనుమతులు లేకుండా నిర్వహిస్తే విద్యార్థులు నష్టపోతారు. అనుమతుల అంశంలో పూర్తిగా విచారణ చేపట్టిన అనంతరమే పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

\- అయ్యుబ్‌ఖాన్, ట్రస్మా జిల్లా ప్రధానకార్యదర్శి

నోటీసులు జారీ చేస్తాం



అనుమతులు లేని పాఠశాలలకు నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా సీబీఎస్ఈ సిలబస్ తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలను తనిఖీ చేస్తాం. విద్యార్థుల భవిష్యత్‌కు ఆటంకం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

\- మంజులాదేవి, ఎంఈవో జడ్చర్ల

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

» సల్కాపురం క్రషర్ వద్ద ఘటన

» నిర్వాహకులతో కుటుంబ సభ్యుల వాగ్వాదం



సల్కాపురం గుట్టలో క్రషర్ వద్ద మృతి చెందిన వృద్ధుడిని పరిశీలిస్తున్న పోలీసులు

గట్టు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని సల్కాపురం గట్టు వద్ద గల క్రషర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగన్‌గట్టుకు చెందిన ఆంజనేయులు (55) గురువారం గట్టు కు వెళ్లి వస్తుండగా సల్కాపురంలోని క్రషర్ వద్దకు పోయాడు. అనంతరం అక్కడ సిబ్బంది అతనికి భోజనం పెట్టారు. భోజనం చేస్తుండగానే కింద పడిపోయాడు. వెంటనే తేరుకున్న సిబ్బంది ఎంత లేపినా లేవలేదు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడి చేరుకుని మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన వందల మంది క్రషర్ వద్దకు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అందరూ భోజనం చేశారని, కానీ ఆంజ నేయులు మాత్రమే ఎలా మృతి చెందుతాడని వారు కంపెని సిబ్బందిని ప్రశ్నించారు. ఆందోళన పెద్ది కావడంతో సమాచారం పోలీసులకు చేరింది. వెంటనే అక్కడికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం



ఉండవల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన బాధితురాలు

అలంపూరుచౌరస్తా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఓ మహిళ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన మాదర్‌సాబ్ భార్య ఖజాబీ 30ఏళ్ల క్రితమే అతన్ని వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతడిని అన్న కూతురు అయిన రిజ్వాన బాగోగులు చూసినందుకు తమ చిన్నాన్నకు చెందిన 1.38 ఎకరాల భూమిని రిజ్వానకు చెందేలా వీలునామా రాయించుకుంది. మాదర్‌సాబ్ అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త చనిపోయాడన్న విషయం తెలుసుకుని ఖాజాబీ గ్రామానికి వచ్చి భర్త మరణధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుని, కుటుంబ ధ్రువీకరణపత్రం పొంది తన భర్త పొలాన్ని విరాసత్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుంది. విషయం తెలుసుకున్న రిజ్వాన, ఆమె కుటుంబ సభ్యులు గురువారం తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దారును అడితే ప్రయత్నం చేస్తుండగా అక్కడి సిబ్బంది బయటకు పంపించేశారు. దీంతో రిజ్వాన తలపై పెట్రోల్ పోసుకుంది. 30ఏళ్ల పాటు తన చిన్నాన్న బాగోగులు చూసుకున్నానని, చనిపోయాక అతడి పొలం భార్యకు ఎలా చేస్తారని వాపోయింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శేఖర్ అక్కడికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పి పంపించేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

మక్తల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మాగనూరు మండలంలోని సత్యవార్ గ్రామానికి చెందిన ఆంజనేయులు, ఊట్కూర్ మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గండీడ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగయ్య అనే రైతు పొలం వద్ద రోజు మాదిరి ఆవులను మేత మేపుతున్న సమయంలో ఓ ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.80 వేలు విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

భార్యాభర్తలపై దాడి, కేసు నమోదు

నవాబ్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భాగ పరిష్కారంలో తమ వాట ఇవ్వాలని గొడవ పడగా అన్న, వదినలపై దాడి తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల గ్రామానికి చెందిన వెంకట్రాములుతో పాటు మరో నలుగురు అన్నదమ్ములున్నారు. రెండవ తమ్ముడైన నర్సింహులు, భార్య కలిసి తమకు భాగ పరిష్కారంలో వాటా ఇవ్వాలని కోరుతూ ఈనెల 20న వెంకట్రాములుతో గొడవపడ్డారు. చిన్నవాడైన రమేష్ వివాహం అనంతరం ఆస్తి పంపకాలు చేసుకుందామని చెప్పినా వినకపోవడంతో పాటు వెంకట్రాములు, భార్య కోస్గి పద్మమ్మపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఊట్కూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. మండలంలోని పెద్దజట్రం గ్రామంలో బియ్యం ఉన్నాయనే సమాచారంతో సివిల్ సప్లయ్ ఆర్‌ఐ వెంకటేష్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ బృందం గ్రామంలోని రాజు ఇంట్లో తనిఖీ చేయగా గదిలో 20 సంచుల్లో 30 నుంచి 35 కిలోల చొప్పున పీడీఎస్ బియ్యం ఉంచుకున్నట్లు గుర్తించారు. మొత్తం 7.30 క్వింటాళ్లు ఉన్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని మండల కేంద్రంలోని చౌక ధర దుకాణంలో నిల్వ చేసి, రాజును అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు



కురువ చిన్న కర్రెన్న

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. కుమారుడు కురువ నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ఉదయం కురువ చిన్న కర్రెన్న కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాలేదు. దీంతో గురువారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వస్తుందని పేర్కొన్నారు. వృద్ధుడి ఒంటిపై తెలుపు, నీలి రంగు దుస్తులు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

బీసీ స్టడీ సర్కిల్

నిరుద్యోగులకు వరం



గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న యువతీయువకులు

» 6 సంవత్సరాల్లో 1,800 మందికి శిక్షణ

» 50 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు

» గద్వాల, వనపర్తి జిల్లాల వారికి శిక్షణ

గద్వాల టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యార్హతలు ఎన్ని ఉన్నా సరైన శిక్షణ లేకపోతే ఉద్యోగావకాశాలు అందుకోవడం కష్టంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో స్టడీ సర్కిళ్ల ఏర్పాటు అనివార్యంగా మారింది. ఈ క్రమంలో జోగుళాంబ గద్వాల జిల్లా ఏర్పాటు అనంతరం అందుబాటులోకి వచ్చిన తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన నిరుపేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతీ యువకులకు వరంగా మారింది. 2016లో జిల్లా ఏర్పాటు అనంతరం రెండేళ్ల తర్వాత ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిళ్ల మంజూరుకు నిర్ణయం తీసుకున్నది. రెండవ విడతలో గద్వాల జిల్లాకు అవకాశం దక్కింది. అప్పటి తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు గద్వాల ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆంజనేయ గౌడ్ చొరవతో రాష్ట్రంలో రెండవ బీసీ స్టడీ సర్కిల్ గద్వాలకు రావడం విశేషం. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిలాల్లో ఉద్యోగార్థులైన నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన బీసీ స్టడీ సర్కిల్‌కు ఇప్పటి వరకు మొత్తం 1,725 మంది ఎంపికయ్యారు. వారిలో 1,384 మంది రెగ్యులర్‌గా తరగతులకు హాజరై శిక్షణ పొందారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు 75 శాతం హాజరు ఆధారంగా రూ.1500 చొప్పున ప్రతీ నెల స్టైఫండ్ ఇస్తున్నారు. వారిలో ఇప్పటి వరకు 50 మందికి పైగా వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. మరో 150 మందికి పైగా అభ్యర్థులకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా అవకాశం లభించింది.

విభిన్న నోటిఫికేషన్లపై శిక్షణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగావకాశాల కోసం జారీ చేసే నోటిఫికేషన్ ఆధారంగా గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో విభిన్న రకాల కోర్సులపై శిక్షణ లభిస్తుండటం గమనార్హం. 2019, మే నుంచి ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌బీ, గ్రూప్-2 ఉద్యోగాలకు శిక్షణ తరగతుల వరకు అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. అందుకోసం హైదరాబాద్ నుంచి సబ్జెక్టు నిపుణులను రప్పించి శిక్షణ ఇప్పిస్తుండటం వల్ల అభ్యర్థులు సత్ఫలితాలు సాధిస్తున్నారు. గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటి వరకు గ్రూప్ ఫౌండేషన్ కోర్సు, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ అండ్ ఎస్‌ఎస్‌సీ ఫౌండేషన్ కోర్సు గ్రూపులు, టీచర్లు, ఎస్‌ఐ అండ్ పోలీస్ కానిస్టేబుళ్లు, ప్రిలిమ్స్-2021, 22, ఫోర్ వీలర్ డ్రైవింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ ఇచ్చారు. అలాగే గ్రూప్-1 ప్రిలిమ్స్-2022, గ్రూప్-3, 4, ఎస్‌ఐ అండ్ పోలీస్ కానిస్టేబుళ్లు, మెయిన్స్ - 2023, గ్రూప్-2 (2023), గురుకుల టీచర్లు (2023), గ్రూప్-1 ప్రిలిమ్స్ - 2024, డీఎస్సీ టీచర్లు (ఆన్‌లైన్ అండ్ బుక్ ఫౌండేషన్) ఉద్యోగార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఉపయోగకరంగా ఉంది



ఆర్‌ఆర్‌బీతో పాటు గ్రూప్-2లో అందుతున్న శిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నాకు విషయాలు సులభంగా అర్థం అవుతున్నాయి. గ్రూప్-2లో ఉద్యోగం సాధించడం నా కల. అందుకోసం స్టడీ సర్కిల్‌లో లభిస్తున్న శిక్షణతో లక్ష్యంపై మరింత నమ్మకం ఏర్పడింది.

\- రాణి, అనంతపురం

ఎస్‌ఐ జాబ్ నా లక్ష్యం



పోలీస్‌శాఖలో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా జాబ్ కొట్టాలన్నది నాలక్ష్యం. స్టడీ సర్కిల్‌లో లభిస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. కోచింగ్ సెంటర్ వనపర్తిలోనే ఉండి ఉంటే మరింత బాగుండేది. ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిళ్ల ఏర్పాటు చేసి నిరుద్యోగులకు మేలు చేయాలి.

\- శివకుమార్, వనపర్తి

రైల్వేలో జాబ్ నా ఆకాంక్ష



ఇండియన్ రైల్వేలో అధికారిగా చేరాలన్నది నా ఆకాంక్ష. అందుకు అనుగుణంగా ఆర్‌ఆర్‌బీలో కోచింగ్ పొందుతున్నారు. కోచింగ్ సెంటర్‌లో ప్రతీ రోజు సబ్జెక్టు నిపుణులు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంది. జిల్లా ఏర్పాటు వల్లే మాలాంటి నిరుద్యోగ యువతీ యువకులకు ఇలాంటి అవకాశం లభించడం సంతోషంగా ఉంది.

\- శిరీష, వనపర్తి

త్వరలోనే సొంత భవనం



గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రతీ ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్నందున అభ్యర్థులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించడంలో కొంత ఇబ్బంది ఎదురవుతోంది. సొంత భవనం నిర్మాణం కోసం రెండవ రైల్వేగేటు సమీపంలో ప్రభుత్వం కొంత స్థలాన్ని కేటాయించింది. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

\- కె.రాములు, డైరెక్టర్, గద్వాల బీసీ స్టడీ సర్కిల్

పేదల్లో వికాసం నింపింది మోదీనే

» ఆశ పెట్టి మోసం చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కే సాధ్యం

» జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఖిల్లాఘణపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల్లో వికాసం నింపింది 11 ఏళ్ల మోదీ ప్రభుత్వమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం బీజేపీ జెండా ఆవిష్కరించి వికసిత్ భారత్‌లో భాగంగా 11 ఏళ్ల బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాలన విజయాలు, దేశ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే బడుగు బలహీన వర్గాల ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద డబ్బులు అందిస్తుందని గుర్తు చేశారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీకి ఐదు కేజీలకు నిధులు కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యత లేని బియ్యం సరఫరా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు ఆశ పెట్టడం మోసం చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకే సాధ్యమని విమర్శించారు.

57 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని మర్చిపోయారన్నారు. రూ.4వేల పెన్షన్, రూ.2,500 మహాలక్ష్మి, రూ.500 సిలిండర్, విద్యార్థినులకు స్కూటీలు లాంటి పథకాలు అటకెక్కించారని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, బుచ్చిబాబు గౌడ్, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, సీతారాములు, పెద్దిరెడ్డి, ఆశన్న, నవీన్‌రెడ్డి, శివ శంకర్, సాయినాథ్, సత్యనారాయణ, గోపి, దశరథ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సాయిచంద్ యాది'లో సభను జయప్రదం చేయాలి

» గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని

» అమరచింతలో ఇంటింటి ప్రచారం



అమరచింతలోని ఎంబీ చర్చిలో ప్రచారం నిర్వహిస్తున్న రజిని, నాయకులు

అమరచింత, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా అమరచింతలో ఈనెల 29న దివంగత సాయిచంద్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభను జయప్రదం చేయాలని గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని పిలుపునిచ్చారు. గురువారం సాయిచంద్ యాదిలో బహిరంగసభను జయప్రదం చేయాలని పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బహిరంగ సభకు మాజీ మంత్రులు కల్వకుంట్ల రామారావు, హరీష్ రావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కళాకారులు రానున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌సింగ్, ఎస్‌ఏ రాజు, నరేష్‌రెడ్డి, రమేష్, అక్కల నర సింహులుగౌడ్, నాగభూషణం గౌడ్, చిన్న బాలరాజు, రాజ్‌కుమార్, రవి, శేఖర్, రాజశే ఖర్, కలాం పాషా, శరత్, ప్రేమ్, అలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సభా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

బహిరంగ సభ స్థలాన్ని అమరచింతలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్లు పరిశీలించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద విగ్రహం కోసం ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించి, అనంతరం ప్రభుత్వం హైస్కూల్ గ్రౌండ్‌లో సభా స్థలాన్ని చూశారు.

భోజన నాణ్యతలో రాజీ పడొద్దు

» వీసీ జీఎన్ శ్రీనివాస్

» పీయూలోని బాలుర హాస్టల్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనిర్సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని బాలుర హాస్టల్‌ను గురువారం అధికారులతో కలిసి వీసీ జీఎన్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైన సమస్యలుంటే తమ దృషికి తీసుకురావాలని రోడ్డెక్కి ధర్నాలు చేయకూడదని విద్యార్థులను సూచించారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఎక్కడా రాజీ పడకూడదని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు సమస్యలు వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, మధుసూదన్‌రెడ్డి, రవికాంత్, కృష్ణయ్య, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో టూరిస్టు బస్సు బోల్తా

» బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండను ఢీకొట్టిన డ్రైవర్

» జనగామ నుంచి శ్రీశైలం వెళుతున్న భక్తులు

» తప్పిన ప్రాణాపాయం, ఏడుగురికి స్వల్ప గాయాలు



ఈగలపెంట జెన్‌కో ఆసుపత్రికి వచ్చిన ప్రమాద బాధితులు

దోమలపెంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : టూరిస్టు బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి కొండను ఢీకొట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని నల్లమల ఘాట్ రోడ్డుపై గురువారం ఉదయం చోటుచేసుకున్నది. ఈగలపెంట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా నుంచి శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం బుధవారం రాత్రి నాగరాజు అనే వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శ్రీశైలానికి టూరిస్టు బస్సులో బయలుదేరారు. గురువారం ఉదయం దోమలపెంట ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోకి వచ్చాక బస్సు బ్రేకులు ఫెయిల్ అయినట్లు డ్రైవర్ సురేష్ గుర్తించి భక్తులను అప్రమత్తం చేశాడు. దారిలో ఒక ఆవు, రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును బస్సు ఢీకొట్టింది. వేగంగా వెళుతున్న టూరిస్టు బస్సు అదుపు కావడంలేదని, ఇక ముందుకు వెళితే ప్రాణ నష్టం జరుగుతుందని గమనించిన డ్రైవర్ దోమలపెంట బస్టాండ్ సమీపంలో కొండను ఢీకొట్టడంతో బస్సు బోల్తాపడింది. ఇందులో 17 మంది పెద్దలు, 12 మంది చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో నాగరాజు, డ్రైవర్ సురేష్, రేణుక, రోహిత్ మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారికి ఓ అంబులెన్స్‌లో ఈగలపెంట జెన్‌కో ఆసుపత్రిలో చికిత్స చేసి పంపించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఏఎస్‌ఐ బాల్‌నాయక్ వారు చెప్పారు.

జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపిక



శిరీష



అరవింద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ /అయిజ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో ఈ నెల 28 నుంచి జూలై 1 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పురుషుల కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు బాలానగర్ మండలం లింగారెడ్డి గూడకు చెందిన అరవింద్ ఎంపిక య్యాడు. జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికావటంపై జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాల రాజు, నర్సింహులు అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని సూచించారు.

• అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని మేడికొండ గ్రామానికి చెందిన శిరీష అండర్-18 విభాగంలో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు స్థానం సంపాదించింది. ఈమె రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఆనంద్‌గౌడ్



అవార్డు అందుకుంటున్న పాలెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్

బిజినేపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రభుత్వ ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్‌కు తక్కువ డ్రాప్ అవుట్ ఉన్న పది కళాశాల్లో పాలెం కళాశాల నిలిచినందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా గురువారం ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల్లో నిష్ణాతులైన ఉపన్యాసకులు, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్స్ ఉండి ఆహ్లాదకరమైన వాతావరణంలో కళాశాల క్యాంపస్ ఉందన్నారు. అవార్డు అందుకున్న ఆనంద్‌గౌడ్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మదన్‌మోహన్‌రెడ్డి, బండి నరసింహ, ఎండీ గౌస్, వినోద్, పద్మజ, జానయ్య, విష్ణు, ప్రవీణ్, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

నేర పరిశోధనలో అవగాహన ఉండాలి

» శిక్షణ అధికారి రాజేంద్రప్రసాద్



నేర పరిశోధనపై పోలీసులకు శిక్షణ అందిస్తున్న అధికారి రాజేంద్రప్రసాద్

కోయిలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో పోలీసులు మరింత అవగాహన కలిగి, వేగంగా ఛేదించేందుకు కృషి చేయాలని జిల్లా నేర పరిశోధన అధికారి రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ పోలీస్‌స్టేషన్‌లో నేర పరిశోధన నూతన ల్యాబ్‌ను ప్రారంభించి పోలీసులకు శిక్షణ ఇచ్చారు. కేసు ఛేదనలో పోలీసులు వేలి ముద్రలు, పాద ముద్రలు ఏవిధంగా తీసుకోవాలన్న విషయం గురించి అవగాహన కల్పించారు. నేరస్తుడిని ఎలా గుర్తించాలి, వారి పాత నేరాలు గురించి తెలుసుకునేలా నూతన టెక్నాలజీ వాడాలన్నారు. ఈ ల్యాబ్ ద్వారా కేసుల ఛేదన వేగవంతం అవుతుందని రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మిడ్జిల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడియాలకు చెందిన రాఘవేందర్‌కు గురువారం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును కాంగ్రెస్ జిల్లా నాయకుడు విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్ అందజేశారు.

నర్సరీ పరిశీలన

నవాబ్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నర్సరీని గురువారం ఏపీవో జ్యోతితో కలిసి ఎంపీడీవో జయరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతీ ఒక్కరు ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

అక్రమాలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదు

బాలానగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాయపల్లి గ్రామ శివారులోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో రికవరీ పేరు గల వెంచర్‌లో అక్రమాలు జరిగాయని రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన వెంకటయ్య గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 102లో రెండు ఎకరాలు, సర్వే నంబర్ 105 లో 0.20 గుంటల భూమి కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చలో కమిషనరేట్‌ను విజయవంతం చేయాలి

మహ్మదాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న నిర్వహించే చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పంచాయతీ కార్మికులను కోరారు. గురువారం మహ్మదాబాద్ మండల పంచాయతీ కార్మికులతో నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన రాష్ట్ర నాయకుడు ఖమర్ అలీతో కలిసి మాట్లాడారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు శివరాములు, రఘురాములు, కిష్టయ్య, వెంకటయ్య, చంద్రమ్మ, వెంకటమ్మపాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాలమూరు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ పీఆర్టీయూ నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, నాగిరెడ్డి, భూపతిసింగ్, సాయిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, మహిపాల్ పాల్గొన్నారు.

ఒక్క టీబీ కేసు కూడా వదలొద్దు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : టీబీ ముక్త్ భారత్ కింద రెండో విడత టీబీ కేసుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఒక్క టీబీ కేసును కూడా వదలొద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ల సమావేశానికి ఆయనతో పాటు డబ్ల్యూహెచ్‌వో రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ మహేష్ హాజరై, మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ కింద గతంలో 100 రోజుల టీబీ వ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించామని, తాజాగా రెండో విడత కూడా ప్రారంభం అవుతున్నందున దీన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా టీబీ నియంత్రణ అధికారి మల్లికార్జున్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శశికాంత్, డెమో మంజుల పాల్గొన్నారు.

దేవరకద్ర మునిసిపల్ కమిషనర్‌గా నరేష్‌బాబు


నరేష్‌బాబు

దేవరకద్ర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మునిసిపల్ కమిషనర్ గా నరేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇతను నాగర్‌కర్నూల్ మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ.. బదిలీపై దేవరకద్రకు వచ్చారు.

బీజేపీ ఉపాధ్యక్షులుగా మహిళలకు చోటు

కోయిలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల కమిటీలో మహిళలకు ప్రధాన స్థానం కల్పించినట్లు ఆ పార్టీ నాయకుడు వెంకట్రామిరెడ్డి, రాములుగౌడ్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ గతంలో ఏ పార్టీ ప్రకటించని విధంగా బీజేపీ మండల ఉపాధ్యక్షురాలిగా గిరిజన మహిళ శోభా వెంకట్‌నాయక్, బీసీ యాదమ్మ రాములుగౌడ్‌ను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కార్యదర్శులుగా రాంపూర్ ఆనంద్, యాదిరెడ్డి, కోశాధికారిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి

మూసాపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోనే పేద బడుగు, బలహీన వర్గాలతో నాటు అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ సమ న్వయకర్త గజ్జి భాస్కర్ అన్నారు. గురువారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లో వేర్వేరుగా మండల కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. త్వరలో గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలను పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, శ్రీహరి, మాజీ ఎంపీపీలు కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాధిక పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే తాట తీస్తా

- ఇందిరమ్మ ఇళ్ల పేరిట వసూళ్లకు పాల్పడొద్దు
- ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి


మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదోడి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని, అర్హులైన లబ్ధిదారుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూళ్లకు పాల్పడితే తాట తీస్తానని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. అవసరమైతే అర్హులందరికీ మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. హౌసింగ్ పీడీ భాస్కర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి, శివకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, రంజిత్‌కుమార్, రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, కృష్ణకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఏదులాపూర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, పోలీసులు

రాజాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. వారోత్సవాల భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అదనపు ఎస్పీ రత్నం, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ శివానందం, ఎంఈవో సుధాకర్, యాదయ్య, శ్రీధర్ రెడ్డి, రమణ, రమేష్, నసీర్‌బైగ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : జీఎంఆర్

దేవరకద్ర : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో మార్కెట్ యార్డు నుంచి ప్రభుత్వ బాలుర పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించి, మాట్లాడారు. యువత చెడు వ్యవసనాలకు బానిస కాకుండా జీవితంలో ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మత్తు పదార్థాల వినియోగం సమాజానికి విఘాతం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) : మత్తు పదార్థాల వినియోగం వల్ల ఒక వ్యక్తికే నష్టం కాదని, యావత్ సమాజానికే విఘాతం కలుగుతోందని ఎస్వీఎస్ వైద్య కళాశాల మానసిక ఆరోగ్య విభాగాధిపతి డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్వీఎస్ వైద్యకళాశాల, ఆసుపత్రిలోని మానసిక, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తుపదార్థాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై చేసిన స్కిట్ ఆకట్టుకుంది. అనంతరం ఆ విభాగాధిపతి మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసైన వారికి చికిత్స అందుబాటులో ఉందని, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్వీఎస్ విద్యాసంస్థల రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ఎండీ కె.జె రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ జోషి, అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకట రాహుల్, డాక్టర్ భార్గవ స్వరాజ్, డాక్టర్ వినీల్‌కుమార్ పాల్గొన్నారు.

● జడ్చర్ల : నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని పట్టణంలోని సిగ్నల్‌గడ్డ నుంచి నేతాజీ చౌరస్తా వరకు నిర్వహించారు. జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో మంజులాదేవి, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, సీడీపీవో శోభారాణి, ఐసీడీఎస్ సిబ్బంది, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి, ఎస్ఐలు కార్తీక్, నాగార్జున, శృతి, కాంగ్రెస్ నాయకుడు మినాజ్ పాల్గొన్నారు.

● హన్వాడ : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. హన్వాడలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉందామని ప్రతిజ్ఞ చేశారు. హెడ్ కానిస్టేబుల్ హిదాయిత్‌అలీ పాల్గొన్నారు.

● మూసాపేట : మాదక ద్రవ్యాల నివారణకై కలిసికట్టుగా కృషి చేయాలని అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఎస్ఐ రాజేశ్వర్‌రావు, హెచ్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

జీవితాలు కోల్పోతాం : ఎస్పీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : మాదకద్రవ్యాలతో యువత తమ జీవితాలను కోల్పోవడమే కాకుండా, వారి కుటుంబాలకు తీరని వేదనను మిగులుస్తున్నారని ఎస్పీ జానకి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎస్పీ పాల్గొని, మాట్లాడారు. మాదకద్రవ్యాలు వాడడంతో ఆరోగ్యం దెబ్బతిన డంతో పాటు, శరీరంలో చురుకుదనం తగ్గిపోతుందన్నారు. కళ్లు ఎర్రబడి, బరువును కోల్పోతారన్నారు. ఒక్కసారి మాదకద్రవ్యాల వినియోగం కేసులో పోలీసు రికార్డులో నమోదైతే ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు రాదని గుర్తు చేశారు. హిటాచి గ్రీన్‌స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ఏడుగురు విద్యార్థుల ను ఎస్పీ అభినందించారు. కళాశాల చైర్మన్ కెఎస్ రవికుమార్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. సేనోడ్రగ్స్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పరీక్షల నిర్వహణ అధికారి సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు పట్టు సాధించాలి


కంప్యూటర్ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

పాలమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు ఏదో ఒక స్కిల్స్‌లో పట్టు సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఉచిత కంప్యూటర్ శిక్షణకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదువుతో పాటు అదనంగా ఏదైనా ఒక స్కిల్స్‌లో ప్రతిభ సాధించాలన్నారు. రానున్న రోజుల్లో మహిళా సంఘాల సభ్యులకు కంప్యూటర్ నైపుణ్య శిక్షణ ఉండాలని, తమ పిల్లలకు కంప్యూటర్ శిక్షణ ఇప్పించాలన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో సెట్విన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణను మహిళలు మంచిగా పూర్తి చేయాలన్నారు. గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వినోద్ కుమార్, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, సెట్విన్ విజయ్‌కుమార్, ఫ్యాకల్టీ రోజారాణి పాల్గొన్నారు. అంతకముందు దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ భవనంలో ఉర్దూఘర్ నిర్మాణం నిలిపివేసి మరోచోట కేటాయించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సింగిరెడ్డి పరమేశ్వర్, మల్లెపోగు శ్రీనివాస్, కాలె నరేందర్, ప్రవీణ్‌కుమార్, బోయపల్లి నరసింహులు, మాణిక్యంరాజు, కానుగడ్డ యాదయ్య, పులిజాల రవికిరణ్, గోకారం చెన్నయ్య, యాంకి రమేష్, వడకంటి మాదగిరి, ఎస్.బాలరాజు, కె.వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించండి : ఎమ్మెల్యే

జడ్చర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో అక్రమంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించాలంటూ అధికారులకు సూచిస్తూ గురువారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. జడ్చర్లలో నూతనంగా 1000 ఇళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సూచించారు. కేటాయింపులు లేకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న వారందరినీ ఖాళీ చేయించి, అర్హులైన వారికి అధికారికంగా కేటాయించాలన్నారు. ఎవరికైనా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం డబ్బులు ఇచ్చినట్లయితే, తీసుకున్న వారితో వసూలు చేసుకోవాలని, డబ్బులు వెనక్కి ఇవ్వకపోతే కేసులు నమోదు చేయాలన్నారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట ప్రాంతంలో 560 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం అయ్యాయని, ఎన్నికల ముందు బీఆర్ఎస్ నాయకులు ఒక్కో ఇంటికి రూ.2 లక్షల చొప్పున అక్రమంగా వసూలు చేశారని, కట్టిన ఇళ్లల్లోకి పోయి నివాసం ఉండాలంటూ వారిని పంపించారంటూ ఆరోపించారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల అవినీతి వ్యవహారం బహిర్గతం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎర్రగుట్టలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో సొంత ప్లాట్లు కోల్పోయిన 60 మంది పేదలున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ, మునిసిపాలిటీ, హౌజింగ్, పోలీసుశాఖ అధికారుల సమన్వయంతో కలిసి పనిచేసి ఖాళీ చేయించాలని సూచించారు. జడ్చర్ల పట్టణంలో మరో 1000 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించడానికి అవకాశం ఉందని, త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

29న వీరశైవ లింగ బలిజ సర్వసభ్య సమావేశం

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29న పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులస్తుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు వజ్రలింగం, ప్రధాన కార్యదర్శి శంకర్ లింగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణ అధ్యక్షుడు పోకల శివుడు అధ్యక్షత తువ్వగుట్ట బసవభవన్‌లో జరిగే ఈ సమావేశంలో ఆర్థిక నివేదిక, కార్యవర్గ ఎన్నికలపై చర్చించనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై ఐక్యపోరాటం



మాట్లాడుతున్న ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్

పాలమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల ఇళ్ల సమస్యలపై ఐక్యంగా పోరాటం చేద్దామని మూడు రోజులుగా ఇళ్ల సమస్యలపై ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలకు ప్రెస్‌క్లబ్, ప్రధాన దినపత్రిక, టీవీ చానల్, బ్యూరోలు, జర్నలిస్టులు సంపూర్ణ మద్దతు పలికారు. గురువారం దీక్షా శిబిరానికి చేరుకుని ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్యూరోలు రవీందర్‌రెడ్డి, శివకుమార్, ధరణి, ఉర్దూ జర్నలిస్టులు అహద్, షాబుద్దీన్, జాఫర్ ప్రసంగించారు. ఫెడరేషన్ చేపట్టిన దీక్షలకు మద్దతు తెలపడంతో పాటు భవిష్యత్ కార్యాచరణలో భాగస్వామ్యం అవుతామన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేందరాచారి, నరేందర్‌గౌడ్ జర్నలిస్టుల ఆందోళన సరైందని, అందరం కలిసికట్టుగా సమస్యను పరిష్కరించుకుందామన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వాకిటి అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయకుమార్ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ మిత్రులు మద్దతు తెలపటం సంతోషంగా ఉందన్నారు. బీసీ జేఏసీ నాయకుడు మైత్రి యాదయ్య మద్దతు తెలిపారు. ఎండీ రఫీ, ఉమామహేశ్వరరావు, కార్యదర్శి గోపాల్, శ్రీనివాస్, రవీందర్, గోపాల్, గోపాలకృష్ణ, యాదయ్య, రామకృష్ణ, అనిల్‌కుమార్, బాలు, రాఘవేందర్, దిలీప్, రాంకొండ, మోహనాదాసు, భాస్కరాచారి, సతీష్‌కుమార్, రవి, రవీందర్‌గౌడ్, సత్యప్రకాష్, ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, రాము, కేశవులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : కలెక్టర్


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

గండీడ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మండలంలోని సల్కర్‌పేట్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ సెంటర్లతో పాటు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అక్షరాలు రాయడం, చదవడాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వెజిటేబుల్ కర్రీ పలుచగా నీళ్లలాగ ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టోర్ రూమ్‌లో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అంచన్‌పల్లి గేటు దగ్గర టోల్ గేటుకు కేటాయించిన 301, 303 సర్వే నంబర్లలో భూమి కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి మారు పేరు కాంగ్రెస్

భూత్పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి మారు పేరు కాంగ్రెస్ ప్రభుత్వమని ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలతో పాటు వాటికి దీపాలు ఏర్పాటు చేయగా, వాటిని గురువారం ప్రారంభించారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల్లో ఉన్న సమస్యలపై ఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ తరగతులు పాఠశాల్లోనే ప్రారంభిస్తున్నామని, 6వ తరగతిలో చేరడానికి 276 దరఖాస్తులు రాగా, విద్యార్థుల ప్రతిభను గుర్తించి మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఇచ్చినట్లు ఎస్‌వో పేర్కొన్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పాఠశాలల్లో చేరడానికి విద్యార్థులు పోటీ పడుతున్నారని ఎంఈవో ఉషారాణి తెలిపారు. అంతకుముందు తాటిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. నాయకులు బోరింగ్ నర్సిములు, కప్పెట టీవీరెడ్డి, శ్రీను, కిట్టప్ప, లక్ష్మీకాంత్‌రెడ్డి, నరేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమ్మప్పగౌడ్, రావులపల్లి నర్సిములు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


యువమోర్చా నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి

భూత్పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ పాలమూరు పార్లమెంటు ఇన్‌చార్జి డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫారుక్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి కొండా ప్రశాంత్‌రెడ్డితో కలిసి హాజరై, మాట్లాడారు. 14 నెలల్లోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెందారని. దీంతో స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. స్థానిక ఎన్నికలతో పాటు సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో యువత బీజేపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, ఇందుకోసం బూతు స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని యువతను సూచించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఫారుక్, యువకులు నర్సిములు, రాజగోపాల్‌రెడ్డి, శ్రీను, వివిధ మండలాల బీజేపీ యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

హన్వాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి జనార్ధన్ అన్నారు. మండలంలోని అమ్మాపూర్‌లో గురువారం పీఎం దర్తిఆబాన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్, జన జాతీయ ఆదివాసి న్యాయ మహాఅభియన్ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో 25 గిరిజన ఆవాసాలను గుర్తించి ఈనెల 25 నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆధార్‌కార్డు, ఆహార భద్రతాకార్డు, ఆయుష్మాన్ భారత్, కిసాన్‌కార్డు, జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్ కోసం దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీవో యశోదమ్మ, ఎస్‌డీఎఫ్ భాస్కర్ పాల్గొన్నారు.

సంతాప సభకు మాజీ మంత్రులు హాజరు


నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రులు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మాజీ చైర్మన్ సత్తూరు బస్వరాజుగౌడ్ తల్లి కమలమ్మ ఇటీవల మృతి చెందగా, గురువారం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సంతాప సభకు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ హాజరై కమలమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, మురళీధర్‌గౌడ్, గోప్లాపూర్ సత్యనారాయణ, మైమూద్, ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సురేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్టుల పంపిణీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం నగరంలోని ఏనుగొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అకారపు రాజగోపాల్, నరేందర్ టీ షర్టులు పంపిణీ చేశారు. యోగాతో ఆరోగ్యంతో పాటు చదువులో ముందుం టారని తెలిపారు. స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి సాయి కుమార్, కోశాధికారి సురేష్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల అందజేత


విద్యార్థులకు బ్యాగులు అందజేసిన మహేష్

జడ్చర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసరుల్లాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఉండేకోటి మహేష్ గురువారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అనంతప్ప, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుండాలి

మిడ్జిల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకురావాలని, నాటి ఉద్యమ పాఠాలను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పిట్టల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన నాటి ఎమర్జెన్సీ సదస్సుకు ఆయన పాల్గొని, మాట్లాడారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన అధికార వాంఛతో రాజ్యాంగాన్ని హత్య చేయడం జరిగిందన్నారు. ఆ సమయంలో బీజేపీ నేతలు వాజ్‌పేయి, అద్వానీ, నానాజీ దేశముఖ్‌వంటి ఎందరో నాయకుల త్యాగం వల్ల నేడు దేశం ప్రజాస్వామ్య బాటలోకి వచ్చిందన్నారు. జూన్ 25న భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో చీకటి రోజుగా భావించాలన్నారు. ఎమర్జెన్సీ గురించి ప్రతీ ఒక్కరికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ భీమయ్య, మాజీ మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, ఎల్లయ్య, శేఖర్, నవీన్, అరుణ్, నరేష్‌చారి, శివ, మల్లేష్, హరికృష్ణ పాల్గొన్నారు.